క్లుప్తంగా

బస్‌షెల్టర్ సిద్ధం.. ప్రారంభమే ఆలస్యం



నిర్మాణం పూర్తయిన బస్‌షెల్టర్

కొడంగల్: పట్టణ శివారు బీసీ,ఎస్సీ వసతి గృహాల సమీపంలో కోస్గి రహదారి పక్కన నిర్మించిన బస్ షెల్టర్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చొరవతో ఏసీడీపీ నిధులు రూ.15 లక్షలు వెచ్చించి.. కొడంగల్ నుంచి కోస్గి మహబూబ్‌నగర్‌కు వెళ్లే రహదారి పక్కన ఈ షెల్టర్‌ను నిర్మించారు. ఆర్యనగర్, మిట్టిబౌలి, జులైవాడ, ఇస్లాంపుర తదితర కాలనీవాసులకు ఈ షెల్టర్ అనుకూలంగా ఉంటుందని, మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పారు.

బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి



సర్పంచ్‌ను సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు రావులపల్లి చంద్రశేఖర్(ఆర్సీ)గౌడ్ అన్నారు. ఉత్తమ గ్రామ పంచాయతీగా గౌతపూర్ ఎన్నికైన సందర్భంగా ఆదివారం సర్పంచ్ రాజప్పను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్సీ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. జీపీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాకేష్‌గౌడ్, ప్రచార కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, యువ నాయకులు రఘుగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



అంతారంలో క్రైస్తవుల ప్రార్థనలు

తాండూరు రూరల్: ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంతారం, అల్లాపూర్, చెంగోల్, బెనెల్లి, కరన్‌కోట్ గ్రామాలకు చెందిన క్రైస్తవ భక్తులు చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు ప్రభువు మరణించిన తరువాత మూడు రోజులకు తిరిగి లేచాడని నమ్ముతూ ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తారు. అంతారంలోని ఈస్టర్ గుట్ట వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ జీవరత్నం తదితర భక్తులు పాల్గొన్నారు.


ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



చింతకుంటలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ధారూరు: రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వలన తరుచూ మూగజీవాలు విద్యుదాఘాతానికి గురవుతున్నాయని, పశునష్టం జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని చింతకుంట రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం రాకపోకలు కొనసాగించే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడం వలన ప్రమాదం పొంచి ఉందని, కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గేటు లేక.. పందులకు ఆవాసం!



ధ్వంసం అయిన పాఠశాల ప్రధాన ద్వారం గేటు

ధారూరు: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, లైబ్రరీకి ఏర్పాటు చేసిన ప్రధాన గేటు ధ్వంసం కావడంతో పందులు, ఇతర మూగజీవాలకు ఆవాసంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గేటుకు మరమ్మతు చేయించాలని వారు కోరారు.

సొంత భవనాలకు మోక్షం

కొత్తగా ఏర్పడిన పంచాయతీలతో పాటు పాత వాటికి అవసరమున్న చోటా సొంత భవనాల నిర్మాణానికి మోక్షం లభించింది. దీంతో ఇరుకు గదులు, అరకొర వసతులతో దశాబ్దాలుగా శిథిలావస్థ జీపీ భవనాలతో నెట్టుకొస్తున్న పాలకవర్గ సభ్యుల ఇబ్బందులు దూరం కానున్నాయి.

- తీరనున్న పంచాయతీల కల
- 23 కొత్త జీపీలకు సొంత కార్యాలయాలు
- పాతవాటికీ ప్రాధాన్యత
- నిధులు మంజూరు.. నిర్మాణ పనులు షురూ



ముద్దాయిపేటలో కొనసాగుతున్న కొత్త పంచాయతీ భవన నిర్మాణ పనులు

యాలాల: యాలాల మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో చాలా వాటికీ.. సొంత భవనాలు లేకుండానే పాలకులు పరిపాలన కొనసాగించారు. ఇటీవల ఏర్పడిన కొత్త జీపీలతో పాటు పాత పంచాయతీల భవనాలు పూర్తిగా శిథిలావస్థలోకి చేరాయి. వాటి స్థానంలో సకల సౌకర్యాలతో కూడిన కొత్త పంచాయతీ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

సకల సౌకర్యాలతో..

మండలంలో అచ్యుతాపూర్, అక్కంపల్లి, అన్నసాగర్, బెన్నూరు, చెన్నారం, దేవనూరు, గోరేపల్లి, జుంటుపల్లి, కమాల్‌పూర్, కిష్టాపూర్, కోకట్, లక్ష్మీనారాయణపూర్, ముద్దాయిపేట, ముకుందాపూర్, నాగసముందర్, పేర్కంపల్లి, రాస్నం, రేళ్లగడ్డతండా, సంగాయిపల్లితండా, సంగెంకుర్దు, తిమ్మాయిపల్లి, విశ్వనాథ్‌పూర్, ఎన్కెపల్లి గ్రామాలకు కొత్త భవనాల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. అంతే కాకుండా.. ఆయా గ్రామాల్లో మంజూరైన కొత్త భవనాల నిర్మాణ పనులకు ఇటీవల ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శంకుస్థాపన చేయగా.. చాలా గ్రామాల్లో నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా.. పూర్వ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరి అసౌకర్యంగా మారగా.. కొన్ని పంచాయతీల్లో పెచ్చులూడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి. కొత్తగా నిర్మిస్తున్న భవనాల్లో సమావేశ మందిరం, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక గది, రికార్డు రూం, మరుగుదొడ్లు తదితర సకలవసతులు కల్పించనున్నారు. ఈ భవనాలు వినియోగంలోకి వస్తే.. పల్లెలకు సరికొత్త కళ సంతరించుకున్నట్లే అని పల్లె ప్రథమ పౌరులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

13న ఆత్మీయ సమ్మేళనం

- పాల్గొననున్న మంత్రి హరీశ్‌రావు
- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మర్పల్లి: ఈ నెల 13న మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ చెప్పారు. ఈ మేరకు ఆదివారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మధుకర్‌తో కలిసి సమ్మేళన ఏర్పాట్లపై సమీక్షించి మాట్లాడారు. కార్యక్రమానికి ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సోయెల్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, మార్కెట్ డైరెక్టర్ గౌస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాచన్న, రమేష్ మిత్ర, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

పరిగి: బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సత్యసాయి సమితి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, బాటసారులు, ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూడూర్ జెడ్పీటీసీ మేఘమాల, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు, రవికుమార్, రవీందర్ సేవా సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

బీజేపీ కో హటావో.. దేశ్‌కి బచావో

ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్ల: ఈనెల 14వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం చేపట్టి ప్రజలకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తెలియజేయాలని పార్టీ నిర్ణయించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'బీజేపీకో హటావో దేశ్‌కి బచావో' పేరుతో దేశ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లా, ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమంతో ప్రజల వద్దకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను దేశ సమైక్యత సమగ్రతకు వాటిల్లే ప్రమాదాలను ప్రజలకు వివరించనున్నట్లు వెల్లడలించారు. దేశంలో ప్రమాదకర ఫాసిస్ట్ నిరంకుశ హిట్లర్ తరహా పాలన అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. దీనికి వామపక్ష ప్రగతిశీల, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో కూడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలను చైతన్యపరిచే పాదయాత్రలను, ప్రజాపోరు యాత్రలను, వివిధ రూపాల్లో చేపట్టి ప్రతి గ్రామం సందర్శించాలని సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. దీనికి పార్టీ నాయకులు కార్యకర్తలు అంతా సమష్టిగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభులింగం, సుధాకర్, సుభాన్‌రెడ్డి, ఎండీ మక్బుల్, సత్యనారాయణ, సత్తిరెడ్డి, అంజయ్య, మల్లేశ్, కృష్ణగౌడ్, శివ, మంజుల, మాధవి, విజయమ్మ, సాయిలమ్మ, మీనాక్షి తదితరులు ఉన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సహజ సంపద దోపిడీ!



ఓవర్ లోడ్‌తో వెళ్తున్న సుద్ద టిప్పర్

- సుద్ద వ్యాపారుల ఇష్టారాజ్యం
- నిబంధనలకు విరుద్ధంగా తరలింపు
- ఓవర్ లోడ్‌తో దూసుకెళ్తున్న వాహనాలు
- టార్పాలిన్ కప్పకుండానే తరలింపు
- రాయల్టీ చెల్లించకుండా ఫ్యాక్టరీలకు చేరవేత

పెద్దేముల్: సుద్ద వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సామర్థ్యానికి మించి లారీల్లో తరలిస్తూ.. ఖనిజ సంపదను దోచేయడమే కాకుండా.. రోడ్డు ప్రమాదాలకు కారకులుగా మారుతున్నారని, వీటిని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 20 రోజులుగా సుద్ద పరిశ్రమల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా భారీగా సహజ సంపదను తరలిస్తుండగా.. సంబంధిత అధికారుల చోద్యం చూస్తున్నారని, ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకోవడం లేదని, ఫలితంగా వ్యాపారులు మరింత రెచ్చిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

టార్పాలిన్ కప్పకుండానే..

ఏడాది క్రితం మంబాపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ శ్రావణ్‌కుమార్ ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌లను ఆపి.. మైనింగ్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధిక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ల నుంచి సుద్ద రోడ్లపై పడుతుండడంతో.. వెనకాల వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం సుద్ద టిప్పర్లపై టార్పాలిన్ నిండుగా కప్పి రవాణా చేయాల్సి ఉంటుంది. గతంలో ఇలాగే చేసేవారు. కానీ.. రెండేళ్ల నుంచి సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో సుద్ద యజమానులు ఇష్టారాజ్యంగా రవాణా చేస్తున్నారు.

> **రాయల్టీ లేకుంటే సీజ్..**
>
> ప్రతి లారీకి తప్పకుండా రాయల్టీ ఉండాలి. రాయల్టీ చెల్లించకుండా సుద్దను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఓవర్ లోడ్ లారీలు, టిప్పర్లు వెళితే.. సర్పంచ్‌లు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. అక్రమంగా సుద్ద గనులు ఉంటే సమాచారం ఇవ్వండి. చర్యలు తీసుకుంటాం.
>
> – సాంబశివరావు, మైనింగ్ ఏడి

నామ మాత్రంగా రాయల్టీ...

పరిశ్రమల యజమానులు నామ మాత్రంగా రాయల్టీ చెల్లించి.. సుద్ద వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి ట్రిప్పుకు రాయల్టీ కట్టాల్సి ఉంటుంది. కానీ ఒక రాయల్టీతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సుద్దను తరలిస్తున్నారు. వాటిని పరిశీలించాల్సిన మైనింగ్ అధికారులు ఏడాదికి ఒక్కసారి కూడా కనబడరని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలం పరిధిలో సుద్ద పరిశ్రమలు అనేకం ఉన్నాయి. రాయల్టీ లేకుండా ముడి ఖనిజాన్ని తరలించడం ఇక్కడ నిత్యకృత్యమైనట్లు తెలుస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు నామ మాత్ర తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు.. ఓవర్ లోడ్‌ను అరికట్టి, అక్రమ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

పండుగలు ఉత్సాహంగా జరుపుకోవాలి



ఈస్టర్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: కుల మతాలకు అతీతంగా పండుగలు ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగ పురస్కరించుకొని కనకమామిడి గుట్టపై ఉన్న చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఎమ్మెల్యే యాదయ్య పాల్గొని క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి సంక్షేమం కోసం క్రీస్తు పునరుద్ధరణ పొందిన పవిత్రమైన రోజే ఈస్టర్ పర్వదినం అని చెప్పారు. ఈ సందర్భంగా క్రైస్తవులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈస్టర్ వేడుకలు కనకమామిడి గుట్టపై నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీటీసీ ప్రభావతి గణేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎంఎస్ రత్నం, మైసని రవి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'బలగం' ప్రదర్శన

- కంటతడి పెట్టిన ప్రేక్షకులు

షాబాద్: మానవ విలువలు మరిచి, స్వార్థాలతో.. చిన్న చిన్న గొడవలకు దూరమవుతున్న బంధాలకు బలగం సినిమా కనువిప్పు కలిగిస్తోంది. మండల పరిధిలోని రుద్రారం, దేవునిగడ్డ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, పెద్దవేడు, సర్దార్‌నగర్, కుమ్మరిగూడ తదితర గ్రామాల్లో నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో బలగం సినిమాను ప్రజలతో కలిసి వీక్షించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవత విలువలు మరిచి దూరమవుతున్న కుటుంబాలు ఈ సినిమా చూస్తే కలిసి పోవాలనే ఆలోచన వస్తుందని, బలగం మూవీని అందరికీ చూపించాలనే ఆలోచనతో సినిమాను ప్రదర్శించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. దాదాపు 1000 నుంచి 15 వందల మంది వరకు గ్రామస్తులు, ప్రక్క గ్రామాల నుంచి ప్రజలు అధికంగా తరలివచ్చి బలగం సినిమాను చూసిన ప్రతి ఒక్కరు కంటతడి పెట్టారని తెలిపారు. రుద్రారం సర్పంచ్ బండ స్వర్ణలత, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సతీష్‌యాదవ్, రమేష్, కృష్ణ, మల్లేశ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బలగం చిత్రాన్ని చూస్తున్న గ్రామస్తులు

ధర్నాను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ విశ్రాంత పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు నేడు సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం షాద్‌నగర్ అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కొనసాగుతుందని వారు వెల్లడించారు.

ఘనంగా మైసమ్మ జాతర

తాండూరు రూరల్: మండల పరిధి చెంగోల్ గ్రామంలో ఆదివారం మైసమ్మ జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా యాదవులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డోలు వాయిద్యాల నడుమ మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కుల్కచర్ల: ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని అఖిల భారత బంజార సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాహుల్ నాయక్ అన్నారు. ఆదివారం హన్మానాయక్ తండా జీపీలోని దేవాలయాన్ని సందర్శించి మాట్లాడారు. మధ్యలో నిలిచిపోయిన ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాలు పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సూచించారు. కార్యక్రమంలో రవి, చందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

అనంతగిరి: వికారాబాద్ మండల సర్వసభ్యసమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు మండల కార్యాలయ ఆవరణలో ఎంపీపీ చంద్రకళ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

ఆర్థికసాయం

కుల్కచర్ల: నిరుపేదలకు, పార్టీ కార్యకర్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రైతుబంధు మండల కమిటీ అధ్యక్షుడు కొత్తబలిజ రాజు అన్నారు. పీరంపల్లి గ్రామానికి చెందిన బక్కని మల్కమ్మ మృతిచెందగా.. ఆదివారం బాధిత కుటుంబీకులకు తక్షణ సహాయంగా రూ.5వేలు అందజేశారు.

అంత్యక్రియలకు..

కుల్కచర్ల: నిరుపేదలకు, పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్లమల బాలమ్మ, పీరంపల్లి గ్రామానికి చెందిన బక్కని మల్కమ్మలు మృతిచెందగా.. అంత్యక్రియల కొరకు తక్షణ సాయంగా ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి పంపిణీ చేసిన నగదును అందజేశారు.

పూలే జీవితం అందరికీ ఆదర్శం

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్



రమణారెడ్డికి పూలే చిత్రపటాన్ని అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

చేవెళ్ల: మహాత్మాజ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఆయన అడుగుజాడల్లో నడవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజేశ్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఫొటో ప్రతి కార్యాలయంలో ఉండేలా ఆయన చిత్రపటాలను అందించేందుకు పీడీఎస్‌యూ నిర్ణయించిందని చెప్పారు. ఆదివారం చేవెళ్లలోని పలు వసతిగృహాల్లో ఈ ఆయన చిత్రపటాలను ఆ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 11వ తేదీన మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఆయన జీవించిన కాలంలో పుట్టిన తేదీలు అనేవి శూద్రులు, అతిశూద్రులకు తెలిసేది కాదని, పూలే 1827 ఏప్రిల్ 11న జన్మించాడని చెప్పటానికి ఆధారం ఆ రోజు షేష్వా రాజుల రాజమహాల్ మంటల్లో కాలిపోయిన ఘటన చోటు చేసుకుంది. అదేరోజున పూలే జననం జరిగింది. బ్రాహ్మణ వర్గాలు షేష్వారాజమహాల్ మంటల్లో కాలిపోయిన సంఘటనను గుర్తుంచుకున్నారు. కావున ఆయన జననం కూడా అందరికీ తెలిసింది. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారని గుర్తు చేశారు. 1873 సెప్టెంబర్ 24న పూలే తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో అన్ని కులాలు, మతాల ప్రజలు చేరవచ్చునని చెప్పారు. దేశంలో పూలే, అతని భార్య సావిత్రి బాయి పూలే మహిళల విద్యకు మార్గదర్శకులుగా నిలిచారని పేర్కొన్నారు. బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించినట్లు తెలిపారు. వితంతువుల కోసం ఒక ఆశ్రమాన్ని స్థాపించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అఖిల్, సంతోష్, శ్రీను, ప్రభాష్, రాజు తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో మర్పల్లి బస్టాండ్



మర్పల్లి బస్టాండ్ దుస్థితి. ఇన్‌సెట్లో.. పాడైన మరుగుదొడ్లు

- పెచ్చులూడుతున్న పై కప్పు, పిల్లర్లు
- విద్యుత్ సరఫరా బంద్ విరిగిన కుర్చీలు, బల్లలు
- ప్రయాణ ప్రాంగణంలోకి రాని బస్సులు

మర్పల్లి: బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. ప్రయాణప్రాంగణంలో నెలకొన్న సమస్యలపై పలుమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆరోపించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మర్పల్లి మండల కేంద్రంలో సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం సకల సౌకర్యాలతో ప్రారంభించిన బస్టాండ్.. కొంత కాలం కళకళలాడినా.. క్రమంగా కళతప్పింది. విద్యుత్ లేక చీకట్లో మగ్గుతోంది. కుర్చీలు, బల్లలు పాడయ్యాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు శిథిలావస్థకు చేరి.. అంతిమంగా బస్టాండ్ పూర్తిగా గతితప్పింది. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో అది వృథాగా మారింది.

పందులకు ఆవాసంగా..

సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి నిరుపయోగంగా మారిన బస్టాండ్.. పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా.. పందులకు ఆవాసంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి.. శిథిలావస్థకు చేరుకున్న బస్టాండ్‌కు మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వారాంతపు సెలవులు అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

శంకర్‌పల్లి: మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వారాంతపు సెలవులు ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. ఆదివారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు పారిశుద్ధ్య కార్మికులు నిత్యం మురుగు కాల్వల్లో, చెత్తా చెదారంలో యుద్ధం చేస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు దుస్తులు, నాణ్యమైన సబ్బులు, బూట్లను, శానిటైజర్లను అందించడంలో అధికారులు విఫలయ్యారని ఆరోపించారు. వెంటనే వారికి కావాల్సిన వసతులను సమకూర్చాలని డిమాండ్ చేశారు. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందిస్తున్న విధంగా తెలంగాణలో కూడా పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.21వేలు ఇవ్వాలని కోరారు. అంతే కాకుండా రూ.5లక్షల ప్రమాద బీమా పథకాన్ని కూడా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రమేష్, కోశాధికారి రాములు, ఉపాధ్యక్షుడు శాంతయ్య, కృష్ణ, సభ్యులు లక్ష్మి, రాజు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న దేవేందర్